క్లుప్తంగా

ఎయిడ్స్ బాధితులను ఆదరించాలి



కొవ్వొత్తుల ర్యాలీని ప్రారంభిస్తున్న భీమాబాయి మహిళా మండలి సభ్యులు

తాళ్లరేవు: హెచ్ఐవీ సోకిన బాధితులను ఆదరించాలని, సహాయ సహకారాలు అందించాలని భీమాబాయి మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన అన్నారు. ఆదివారం భీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నందివర్ధన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఏటా మే నెల మూడవ ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. ఎయిడ్స్‌తో మరణించిన వారిని గుర్తు చేసుకోవడంతో పాటు హెచ్ఐవీ బాధితులకు భరోసా అందించడం ఈ కార్యక్రమం నిర్వహణ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పోషకాహారం పంపిణీ

అమలాపురం టౌన్: స్థానిక వంటెద్దువారి వీధిలో హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పోషకాహార కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. జన కల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడు, కె.రిత్విక్, జల్లి సూజాత సౌజన్యంతో ఈ కిట్లను పంపిణీ చేశారు. వాకర్స్ జిల్లా గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, రచయిత్రి పచ్చిగోళ్ల సుధ, జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు ఎస్.పరశురాముడు, జన కల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు కల్వకొలను ఉమ, మద్దింశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

రైతు బజార్‌కు ప్రతి బుధవారం సెలవు

అమలాపురం టౌన్: అమలాపురం రైతు బజార్‌కు తొలి నుంచి ప్రతి మంగళవారం సెలవు దినం అమలవుతూ ఆ రోజు బజార్ మూతపడేది. అయితే మంగళవారం రోజు సెలవును అధికారులు ప్రతీ బుధవారం అమలు చేసేలా నిర్ణయించారు. బజార్‌లో దుకాణాలు నిర్వహించే రైతులు, వ్యాపారులు తమకు మంగళవారం కాకుండా బుధవారం సెలవు ఇవ్వాలని ఇటీవల జిల్లా మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ విశాలాక్షికి చెప్పారు. రైతు బజారుకు మంగళవారం బేరాలు విరివిగా ఉండడం వల్ల రైతులైన వ్యాపారులు ఈ మార్పును కోరుకున్నారు. ఆ రోజు అమలాపురం మార్కెట్‌కు సెలవు దినం కావడంతో వినియోగదారులు నేరుగా రైతు బజార్‌కు వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తున్నారని వారు అధికారులకు వివరించారు. తమ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇక నుంచి ప్రతి బుధవారం రైతు బజార్‌కు సెలువు దినంగా అమలవుతుందని ఆ బజార్ ఇన్‌ఛార్జి ఎస్టేట్ ఆఫీసర్ గోకరకొండ సుబ్బారావు తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

తాళ్లరేవు: తిరుపతిలో దళిత విద్యార్థిని కిడ్నాప్ చేసి హత్యాయత్నానికి పాల్పడిన దోషులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని విశ్వ జన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు కోరారు. తిరుపతిలోని ఓ కళాశాలలో ఇంజినీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్న జేమ్స్ అనే దళిత విద్యార్థిని చంపేందుకు యత్నించడం దారుణమైన చర్యన్నారు. ఈ దుర్మార్గానికి పాల్పడిన రౌడీషీటర్ సాయి రూపేష్, చోటా బ్లేడ్ గ్యాంగ్‌లపై కేసులు నమోదు చేయాలని, జేమ్స్‌కు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేసారు. దళిత విద్యార్థిపై దాడిని విశ్వజన కళామండలి తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్న సమారాధన

తాళ్లరేవు: స్థానిక ప్రధాన రహదారిలో వేంచేసియున్న భూసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఘనంగా ముగిసిన నేపథ్యంలో ఆదివారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్త సుభాష్, కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రేపు జాతీయ రహదారిపై ఆక్రమణల తొలగింపు

తాళ్లరేవు: జాతీయ రహదారి (ఎన్‌హెచ్) 216 చెంతన ఉన్న ఆక్రమణలను ఈ నెల 20న తొలగిస్తామని తహసీల్దార్ పితాని త్రినాథరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని చొల్లంగి నుంచి సుంకరపాలెం వరకు రహదారి చెంతన పలువురు ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు, వ్యాపార దుకాణాలు ఏర్పాటు చేసినట్లు ఫిర్యాదు అందడంతో సంబంధిత అధికారులు ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో రహదారిని ఆనుకుని, ఆక్రమించి చేసిన నిర్మాణాలన్నింటినీ 20వ తేదీలోపు స్వచ్ఛందంగా తొలగించాలని లేని పక్షంలో నేషనల్ హైవే అథారిటీ వారు పోలీసుల సహకారంతో ఆక్రమణలు తొలగిస్తారని, దీనికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని తహసీల్దార్ కోరారు.

పూర్తయ్యేదెన్నడో?

- నిలిచిన జాతీయ ఇంజినీరింగ్ కళాశాల పనులు
- భూమిపూజ చేసి ఆరేళ్లు
- రూ.26 కోట్లతో నిర్మాణం
- ప్రణాళికాబద్ధంగా వ్యవహరించని అధికారులపై విమర్శలు
- 2025–26 విద్యాసంవత్సరంలోనైనా తరగతులు ప్రారంభమయ్యేనా?
- ఎదురుచూస్తున్న విద్యార్థులు



నత్తనడకన సాగుతున్న జాతీయ ఇంజినీరింగ్ కళాశాల భవన పనులు

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో గిరియాంపేటలో రూ.26కోట్ల రూసా నిధులతో ప్రభుత్వ జాతీయ ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణానికి అంగరంగ వైభవంగా భూమి పూజ నిర్వహించారు. ఇది పూర్తయితే ఇంజినీరింగ్ చదువుకోవడానికి వందలాది కిలోమీటర్ల దూరం పుదుచ్చేరి తదతర ప్రాంతాలకు వెళ్తున్న విద్యార్థుల బాధలు తీరతాయని స్థానికులు భావించారు. అయితే భూమిపూజ నిర్వహించి నాలుగేళ్లు పూర్తయినా అర్ధంతరంగా పనులు నిలిచిపోయాయి. ఈ 2025–26 విద్యాసంవత్సరంలోనైనా తరగతులు ప్రారంభమవుతాయనే విద్యార్థుల ఆశలు అడియాశలయ్యేలా ఉన్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

జాతీయ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు దేశవ్యాప్తంగా పోటీ ఉన్నప్పటికి యానాంలో ఇంజనీరింగ్ కళాశాలకు నిధులు అప్పట్లో మంజూరయ్యాయి.

గిరియాంపేట గ్రామంలో నేషనల్ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి రూ.26 కోట్ల రూసా నిధులు మంజూరయ్యాయి. కళాశాల నిర్మాణ పనులపై స్థానిక పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్(పీడబ్ల్యూడీ)అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అస్తవ్యస్తంగా పనులు జరిగినట్టు పలువురు చెబుతున్నారు. ఇప్పటికే తరగతుల నిర్వహణకు కళాశాలకు ఏఐసీటీఈ సైతం అనుమతిచ్చింది. అయినప్పటికీ నిర్మాణాలకు అవుతున్న ఖర్చు పెరుగుపోతుండడంతో పాటు మళ్లీ కొత్తగా కోట్లాది రూపాయలు కావాలంటూ ప్రభుత్వాన్ని అధికారులు కోరుతుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రణాళికాబద్ధంగా నిధులు ఖర్చుచేయకుండా అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని దీనికి తోడు మళ్లీ నిధుల కోసం ప్రతిపాదనలు పంపిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటివరకు కళాశాలలో మూడు బ్లాక్‌లు మాత్రమే నిర్మాణం జరిగింది. మిగిలిన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. రహదారులు, ప్రహరీ, డ్రైనేజీ నిర్మాణంతో పాటు ఎదురుగా ఖాళీ స్థలాన్ని మట్టితో నింపాల్సిన పనులు సైతం ఉన్నాయి. అదే విధంగా ఎలక్ట్రిఫికేషన్ పనులు సైతం పూర్తిస్థాయిలో పూర్తికావాల్సి ఉంది. కాని దీనిపై ఎవరికి పట్టడం లేదని చెబుతున్నారు.



జాతీయ ఇంజినీరింగ్ కళాశాలకు వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన (ఫైల్)



కళాశాల ఎదురుగా మురుగునీరు

వర్చువల్ విధానంలో నాడు శంకుస్థాపన

కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాల్లోను, ఒక కేంద్రపాలిత ప్రాంతంలోను , 70 మోడల్ డిగ్రీ కళాశాలలు, 11 వృత్తి విద్యాకళాశాలలు, ఒక మహిళా యూనివర్సిటీకి నాడు ప్రధాని మోది వర్చువల్ విధానం ద్వారా జమ్ముకాశ్మీర్ రాజధాని శ్రీనగర్ నుంచి ఆయన డిజిటల్ ఫౌండేషన్ స్టోన్ వేశారు. ఇందులో భాగంగా పుదుచ్చేరి పరిధిలోని యానాంకు మంజూరైన జాతీయ ఇంజినీరింగ్ కళాశాలకు సైతం మోదీ శంకుస్థాపన చేశారు.

ఆధునిక టెక్నికల్ కోర్సులు

యానాం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రస్తుత ఆధునిక సాంకేతికతకు ఉపకరించే 5 కోర్సులు ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా రోబోటిక్ ఆటోమేషన్, జియో– ఇన్ఫర్మేటిక్స్ ఇంజినీరింగ్, 3డి యానిమేషన్, గ్రాఫిక్స్ ఇంజినీరింగ్, డిజిటల్ టెక్నిక్స్ ఫర్ డిజైన్ అండ్ ప్లానింగ్ ఇంజినీరింగ్, కంప్యూటింగ్ ఇన్ మల్టీమీడియా ఇంజనీరింగ్ కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. జాతీయ కళాశాల కావడంతో 50 శాతం సీట్లు పుదుచ్చేరికి, 50 శాతం సీట్లు వివిధ రాష్ట్రాల విద్యార్థులకు కేటాయించనున్నారు.



పూర్తికాని విద్యుదీకరణ పనులు

> **నాసిరకం పనులు**
>
> జాతీయ ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులు నాసిరకంగా ఉన్నాయి. నాణ్యత లేకపోవడంతో ప్రారంభం కాకుండానే లోపాలు బయటపడుతున్నాయి. ఈ నిర్మాణాల్లో కోట్లాది రూపాయల అవినీతి జరిగింది ఇంజినీరింగ్ అధికారులు బాధ్యత వహించాలి. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలి. నిధులు సరిపోలేదని ఇవ్వాలని కోరుతున్నారు.
>
> – సబ్బతి శ్రీనివాసరావు, అధ్యక్షుడు, ఆర్.ఎల్.వి.జననాయగం ప్రజాసమస్యల పోరాట సంస్థ, యానాం శాఖ

అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసరాల వితరణ

అల్లవరం: తూర్పులంకలో పిడుగుపాటుకు తాటాకిల్లు దగ్ధమై సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధితులు మందా వీరవెంకటసత్యనారయణ, మందా సత్యనారాయణను మాజీ ఎంపీ చింతా అనురాధ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు 50 కేజీల బియ్యం, వంట సామగ్రి, నిత్యావసర సరకులు, దుస్తులు అందించి ఓదార్చారు. మాజీ ఎంపీ వెంట ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్ కడలి గంగాచలం, బర్రే సీతారత్నం, రాపాక విజయలక్ష్మీ తదితరులున్నారు. మోసుగంటి గంగయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు, రుద్రరాజు సీతాపతిరాజు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు రూ. 5 వేలు నగదు, నిత్యావసర సరుకులు, దుస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు మోసుగంటి వెంకటేశ్వరరావు, రుద్రరాజు రమేష్‌రాజు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలకు నిత్యావసర సరకులు అందిస్తున్న మాజీ ఎంపీ చింతా అనురాధ

నిరుపయోగంగా మంచినీటి ట్యాంకు



పాతాలదిబ్బ ప్రాంతంలోని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు

ఉప్పలగుప్తం: కిత్తనచెరువు ప్రాంతంలో కొన్నేళ్లుగా తాగునీరు లేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల రీత్యా గత ప్రభుత్వం హయాంలో జేజేఎమ్ రూ.36 లక్షల నిధులతో 40 వేల కిలో లీటర్ల ఓహెచ్ఎస్ఆర్‌ను నిర్మించే విధంగా మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఓహెచ్ఎస్ఆర్ పనులు పూర్తయినప్పటికీ దానిని ప్రారంభించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. దీనితో కిత్తనచెరువు, పాతాలదిబ్బ ప్రాంతాల్లో తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఓహెచ్ఎస్ఆర్ కుళాయిలను అనుసంధానం చేసి తాగునీటి సమస్యను తీర్చాలని వారు కోరుతున్నారు.

తాళ్లరేవు లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



తాళ్లరేవులో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఈశ్వర్‌కుమార్ తదితరులు

తాళ్లరేవు: ప్రజలకు ఎంతో ఉపయోగడేలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ తాళ్లరేవు లయన్స్ క్లబ్ ఆదర్శంగా నిలుస్తోందని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఈవీవీ ఈశ్వర్‌కుమార్ అన్నారు. ఆదివారం తాళ్లరేవు లయన్స్ క్లబ్ సిల్వర్‌జూబ్లీ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత ఈశ్వర్‌కుమార్ దంపతులు కోరంగి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తాళ్లరేవు లయన్స్ క్లబ్ హాలులో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. క్లబ్ ప్రతినిధి ధూళిపూడి వెంకటరమణ 90వ సారి రక్తదానం చేసారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌కుమార్ మాట్లాడుతూ స్థానిక పెంకేవారిపేటలోని శ్మశాన వాటికను రూ.50 లక్షలతో అభివృద్ధి, 870 రోజులుగా కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మార్పణ్ ఉచిత అభాగ్యుల భోజన పథకంలో భాగంగా అభాగ్యులకు అన్నదానం, ప్రతి బుధవారం ఆర్యజననీ ట్రస్ట్ ద్వారా గర్భిణులకు అన్నదానం తదితర పథకాలు చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు బి.శ్రీనివాసరెడ్డి, ఎన్.వినోద్, ఎస్,నరసింహారావు, ఎన్వీడీ మూర్తి, పి.పేరయ్యారాజు, పి.నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తిరంగా యాత్ర

ముమ్మిడివరం: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా త్రివిధ దళాలకు సంఘీభావం తెలుపుతూ ముమ్మిడివరం వీధుల్లో ఆదివారం తిరంగా యాత్ర ఘనంగా నిర్వహించారు. నగర పంచాయతీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద తిరంగా యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకూ తిరంగా యాత్రలో ప్రతి ఒక్కరూ జాతీయ జెండాతో భారత్ మాతాకీ జై, వందే మాతరం, మురళీ నాయక్ జోహార్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దాట్ల పృథ్వీరాజ్, చెల్లి అశోక్, కమిషనర్ పి.రవివర్మ, ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ, నాగిడి నాగేశ్వరరావు, గొలకోటి దొరబాబు, తాడి నరసింహరావు, తహసీల్దార్ ఎంపీ సుబ్బలక్ష్మి, ఎంపీడీఓ టి.వెంకటాచార్య, కడలి నాగు, కట్టా సత్తిబాబు, నాయకులు, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో తిరంగా యాత్ర నిర్వహిస్తున్న నాయకులు, ప్రజా సంఘాల సభ్యులు

తాగునీటి సమస్య పరిష్కరించాలి

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలోని 30 వార్డుల్లో తాగునీటి కొరత నెలకొందని పట్టణానికి చెందిన వర్కర్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి తెలిపారు. ఈ మేరకు ఆయన అమలాపురంలో ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 30 వార్డుల్లో తాగునీటి కొరత ఉన్న ప్రాంతాలకు వాటర్ ట్యాంకర్లతో నీటిని ప్రతి రోజూ సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వేసవిలో తాగునీటి సమస్య మరింత జఠిలమైందన్నారు. కొన్ని వార్డుల్లో వాటర్ పైప్ లైన్లు సక్రమంగా లేవని, కాలం చెల్లి తుప్పుపట్టాయని పేర్కొన్నారు. కొత్త పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి ఇంటికీ ప్రజల అవసరాలకు అనుగుణంగా తాగునీటిని సరఫరా చేసేందుకు మున్సిపల్ పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని సూర్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు.

స్వామి, అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో సారె



స్వామి, అమ్మవార్లకు సమర్పించేందుకు సారె తీసుకువెళుతున్న భక్తులు

అమలాపురం రూరల్: బండారులంక బిళ్ల వారి వీధిలో వేంచేసి ఉన్న పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి 38వ వార్షిక మహోత్సవాలు ముగిసిన సందర్భంగా ముత్తయిదువులు స్వామి అమ్మవార్లకు చీర, సారెను సంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో ఆదివారం సమర్పించారు. తొలుత మహిళలందరూ కలసి మంగళ వాయిద్యాలు, గోవింద నామస్మరణతో పసుపు కుంకుమలు, చీర, జాకెట్లు, గాజులు, చలివిడి, అరటి పండ్లు, మిఠాయిలతో ఊరేగింపుగా స్వామి వారి సన్నిధికి వచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు భీరక భీమేశ్వరరావు అర్చకత్వంలో సారెను స్వామి, అమ్మ వార్లకు వేదమంత్రాలతో నివేదించి, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గడపగడపకూ వెళ్లి సారెను భక్తులకు పంచారు. ఈ కార్యక్రమంలో బిళ్ల లక్ష్మీకుమారి, అంకం సత్యలక్ష్మి, నల్లా జయ, బిళ్ల భద్రకాళి, పిచ్చిక జ్యోతి, నల్లా వెంకటసత్యనారాయణమ్మ, ఉప్పుగంటి కుమారలక్ష్మి, దొమ్మేటి దుర్గ, బాసిన భారతి పాల్గొన్నారు.

తైక్వాండోకు పెరుగుతున్న ఆదరణ

అంబాజీపేట: ఆత్మరక్షణతో పాటు ఉత్తమ క్రీడాకారుడిగా గుర్తింపు పొందేందుకు ఇటీవల కాలంలో తైక్వాండోపై విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. అంబాజీపేట, ముంగండ జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న తైక్వాండో వేసవి శిక్షణ శిబిరంలో సుమారుగా 200 మంది క్రీడాకారులు పాల్గొని శిక్షణ పొందుతున్నారు. బాలికలు అధికంగా పాల్గొని శిక్షణ పొందుతున్నారు. క్రీడలు మానసికోల్లాసానికి, శరీర దృఢత్వానికే కాకుండా ఆరోగ్యానికి వ్యాయామం ఎంతో ఉపయోగమనే లక్ష్యంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారు. స్థానిక హైస్కూల్‌లో తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు, పితాని లక్ష్మీభార్గవి పర్యవేక్షణలో సుమారు 20 ఏళ్లగా తైక్వాండో శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ తర్ఫీదు పొందిన 30 మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలోను, 150 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై గోల్డ్ మెడల్ సాధించిన వారిలో ఉన్నారు. బ్లాక్ బెల్ట్ పొందిన క్రీడాకారులు 30 మంది, నేషనల్ రిఫరీలుగా విధులు నిర్వహిస్తున్న వారు 9 మంది ఉన్నారు. వేసవి సెలవులు కావడంతో చిన్నారులను సైతం తైక్వాండో వైపే వారి తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు. వేసవి శిక్షన పూర్తయిన అనంతరం కూడా శిక్షణ తరగతులను ఉదయం 6 గంటల నుంచి నిర్వహిస్తామని త్రిమూర్తులు తెలిపారు.



తైక్వాండోలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

ట్రాఫిక్ ఆంక్షలు.. ప్రజలకు ఇక్కట్లు

- ట్రాఫిక్ పద్మ వ్యూహంలో అమలాపురం పట్టణం
- ఈదరపల్లి వంతెన నిర్మాణ పర్యవసానం
- ట్రాఫిక్ ఆంక్షలతో పెరిగిన దూరాభారం
- అంబాజీపేట, రావులపాలెం వైపు వెళ్లే వాహన చోదకుల అవస్థలు
- ట్రాఫిక్ నియంత్రణలో నిమగ్నమైన పోలీసులు



ట్రాఫిక్ ఆంక్షల కారణంగా అమలాపురం నల్ల వంతెన వద్ద నిలిచిన వాహనాలు

అమలాపురం టౌన్: అసలే ఇరుకు రోడ్లతో ట్రాఫిక్ పరంగా సతమవుతున్న అమలాపురం పట్టణం జిల్లా కేంద్రం అయ్యాక ఆ అవస్థలు రెట్టింపయ్యాయి. పెరిగిన ట్రాఫిక్ భారానికి తోడు ఇప్పుడు ఈదరపల్లి పాత వంతెన పక్కనే కొత్త వంతెన నిర్మిస్తున్న నేపథ్యంలో అనివార్యమైన ఆంక్షల కారణంగా పట్టణ వాసులు ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ట్రాఫిక్‌తో పట్టణం ఉక్కిరిబిక్కిరి అవుతోంది.

వాహనచోదకుల ఇక్కట్లు వర్ణనాతీతం

ఈదరపల్లి రెండో వంతెన నిర్మాణంతో అమలు చేస్తున్న ట్రాఫిక్ ఆంక్షలతో అంబాజీపేట, రావులపాలెం వైపు వెళ్లే, వచ్చే వాహన చోదకులు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. అమలాపురానికి వెళ్లాలన్నా, తిరిగి పట్టణం నుంచి రావాలన్నా వాహన చోదకులు ఆర్‌అండ్‌బీ, పోలీసుశాఖ సూచించిన ప్రత్యామ్నాయ మార్గాలు దూరాభారంతోపాటు అవి పూర్తిగా అసౌకర్యంగా ఉండడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈదరపల్లి కొత్త నిర్మాణం కోసం ఆ పక్కనే ఉన్న పాత వంతెనపై రాకపోకలను పూర్తిగా నిషేధించారు. అమలాపురం ఆర్టీసీ బస్‌స్టేషన్ నుంచి పాత వంతెన మీదుగానే అంబాజీపేట, రావులపాలెం, అటు విజయవాడ, ఇటు రాజమహేంద్రవరం వెళ్లే బస్సులు వెళ్లేవి. ఇప్పుడు ట్రాఫిక్ ఆంక్షలతో అవే బస్సులు అమలాపురం పట్టణం మీదుగా 216 జాతీయ రహదారిపై తోట్లపాలెం, వాకలగరువు మీదుగా అంబాజీపేట, రావులపాలెం వైపు వెళుతున్నాయి. లారీలు, హైటెక్ బస్సులు గతంలో ఈదరపల్లి పాత వంతెన నుంచి అంబాజీపేట, రావులపాలెం మీదుగా రాజమహేంద్రవరం, హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లేవి. అవి ఇప్పుడు ట్రాఫిక్ ఆంక్షలతో అమలాపురం నల్ల వంతెన మీదుగా జనుపల్లె, నేదునూరు, ముక్కామల మీదుగా రావులపాలెం వైపు వెళుతున్నాయి. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు పాత ఈదరపల్లి వంతెన మీద నుంచి అంబాజీపేట, పి.గన్నవరం, రావులపాలెం వైపు నుంచి పట్టణంలోకి వచ్చివెళ్లేవి. అవి ఇప్పుడు ఈదరపల్లి వంతెన సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద పంట కాలువపై తాత్కాలికంగా నిర్మించిన మట్టి క్రాస్ బండ్ మీదుగా పట్టణంలోకి ప్రవేశిస్తున్నాయి. ఈదరపల్లి వంతెన దగ్గరలో గల డాబా గార్డెన్స్ అంతర్గత రోడ్లపై వెళ్లి మట్టి క్రాస్ బండ్‌పై వెళ్లాల్సి వస్తోంది. లేదా ఈదరపల్లి వంతెన నుంచి ఇందుపల్లి పైపు ఈవతలి కాలువ గట్టు వెంబడి దాదాపు కిలోమీటరు వెళ్లి ఈదరపల్లిలో పంట కాలువపై ఉన్న చిన్న వంతెన మీదుగా వాహనాలు పట్టణంలోకి ప్రవేశిస్తున్నాయి. ఇలా మూడు రకాల ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనాలను మళ్లించడం వల్ల వాహన చోదకులు అసౌకర్యానికి గురవుతున్నారు. రాకపోకలకు అధిక సమయాన్ని వెచ్చించాల్సి వస్తోంది.

ట్రాఫిక్ నియంత్రణలో పోలీసు సిబ్బంది నిమగ్నం

అమలాపురం పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేకించి ట్రాఫిక్ పోలీస్ వ్యవస్థ ఉంది. ఓ ట్రాఫిక్ ఎస్సైతోపాటు నిత్యం 12 మంది సిబ్బంది ట్రాఫిక్ నియంత్రణలోనే ఉంటారు. ఈదరపల్లి కొత్త వంతెన నిర్మాణం కారణంగా అమలు చేస్తున్న ట్రాఫిక్ ఆంక్షల కారణంగా మొత్తం పట్టణ పోలీస్ వ్యవస్థ ట్రాఫిక్ నియంత్రణలోనే నిమగ్నం కావాల్సి వస్తోంది. ట్రాఫిక్ ఆంక్షలతో, ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనాలు వందల సంఖ్యలో రావడంతో పట్టణంలోని పలు రోడ్లు ట్రాఫిక్‌తో నిండిపోతున్నాయి. ఈ ట్రాఫిక్‌ను సరిచేయడం పోలీసులకు తలనొప్పిగా తయారైంది. డాబా గార్డెన్స్ అంతర్గత రోడ్లు ఇప్పుడు వాహనాల రాకపోకలతో రద్దీగా మారాయి. పంట కాలువపై మట్టి కల్వర్టు, నల్లవంతెన వద్ద రోజూ తరచూ ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఈ ప్రత్యామ్నామ మార్గాలతో పట్టణంలో ఏ రోడ్డు చూసినా ట్రాఫిక్‌తో నిండిపోతోంది. ఒక సీఐ, ముగ్గురు ఎస్సైలు, కానిస్టేబుళ్లు ఐదు రోజులుగా ట్రాఫిక్ నియంత్రణలోనే నిమగ్నమవుతున్నారు.

ట్రాఫిక్ నియంత్రణ ప్రత్యామ్నాయ మార్గాలు

ప్రస్తుతం పట్టణంలో పెరిగిన ట్రాఫిక్ సమస్యలను పూర్తిగా పరిష్కరించాలంటే ముందుగా నడిపూడి వైపు అయ్యప్ప ఆలయం వద్ద పంట కాలువపై మట్టి క్రాస్ బండ్ నిర్మించినట్లే ఇందుపల్లి వైపు వంతెనకు సమీపంలోనే పంట కాలువపై మరో తాత్కాలికంగా మట్టి క్రాస్ బండ్ నిర్మిస్తే ట్రాఫిక్ కష్టాలు కొంత తీరుతాయి. చిన్న వంతెనల వద్ద నిర్మాణంలో ఉన్న దాదాపు 60 శాతం పూర్తయిన విశ్వరూప్ మార్గ్‌ను ఈదరపల్లి వంతెన నిర్మాణ ఆంక్షల కోసం మిగిలిన పనులు పూర్తి చేసి ఉంటే ట్రాఫిక్ సమస్యలు చాలా వరకూ తీరతాయి. కొత్త వంతెన నిర్మాణం పూర్తయ్యే వరకూ లేదా వంతెన పునాది, పిల్లర్ల నిర్మాణం పూర్తయ్యే వరకూ పాత వంతెనపై ట్రాఫిక్ నిలిపివేత విషయాన్ని వెల్లడించడం లేదు.

> **ట్రాఫిక్ నియత్రణకు అధిక ప్రాధాన్యత**
>
> ఈదరపల్లి వంతెన నిర్మాణం దృష్ట్యా, పాత వంతెనపై ట్రాఫిక్ నిలిపివేత వల్ల ఎదురైన ట్రాఫిక్ ఆంక్షల ఆమలుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. మొత్తం పోలీస్ సిబ్బంది అంతా ట్రాఫిక్ నియంత్రణ విధుల్లో ఉంటున్నారు. ప్రజలు, వాహన చోదకులు ట్రాఫిక్ ఆంక్షల అమలుకు పూర్తిగా సహకరించినప్పుడే నియంత్రణ సాధ్యమవుతుంది.
>
> – పి.వీరబాబు, పట్టణ సీఐ, అమలాపురం

కాళీకృష్ణ ఆశ్రమంలో భక్తిశ్రద్ధలతో ఏకాహం

యానాం: గౌతమీగోదావరి నదీ తీరం యానాంలో కొలువైన శ్రీకాళీకృష్ణా ఆశ్రమంలో ఆదివారం రాత్రి ఏకాహం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యానాం పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కాళీ మాతకు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సలాది సత్యకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి సోమవారం వరకు నిరాటంకంగా భజన కార్యక్రమాలు కొనసాగించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

మత్స్యకార విద్యార్థులకు బహుమతులు

యానాం: నియోజకవర్గ పరిధిలో 2024–25 విద్యాసంవత్సరంలో మత్స్యకార విద్యార్థుల్లో 10, 12 తరగతులలో 60 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారికి మత్స్యశాఖ ద్వారా ప్రోత్సాహక నగదు బహుమతులు అందిస్తారని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆదివారం మత్స్యశాఖ ఏడీ గొంతియ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతిలో 60 శాతం కంటే ఎక్కువ నుంచి 70 శాతం కన్నా తక్కువ మార్కులు సాధించిన వారికి రూ.5వేలు, 70 శాతం కంటే ఎక్కువ మార్కులు కలిగిన వారికి రూ.7,500 ఇస్తున్నట్లు తెలిపారు. 12వ తరగతి విద్యార్థులకు రూ.7వేలు, రూ.15వేలు చొప్పున ఇస్తున్నట్లు తెలిపారు. అర్హులైనవారు ఈనెల 27లోగా దరఖాస్తులు మత్స్యశాఖ కార్యాలయానికి అందజేయాలని కోరారు.